క్లుప్తంగా

రూరల్ సీఐగా వెంకటరావు బాధ్యతల స్వీకరణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.వెంకటరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత సీఐ భూషణం వీఆర్‌కు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న జి.వెంకటరావును ఇక్కడకు బదిలీ చేశారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ



పాములపాడు(తాడికొండ): పాములపాడు గ్రామంలోని ఉర్దూ పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం సోమవారం సదర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చిన్నారులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల బోధనా నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఐడీ కార్డులు, టై, ప్రోగ్రెస్ కార్డులు ఫోటోలు ముద్రించి అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎండీ గౌస్, ఉపాధ్యాయులు ఎండీ ఇబ్రహీం ఖలీలుల్లా పాల్గొన్నారు.

ఘనంగా లూథరన్ దేవాలయ ప్రతిష్ఠ

ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



శాఖమూరు(తాడికొండ): తుళ్ళూరు మండలం శాఖమూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన లూథరన్ దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత పాల్గొని, ప్రత్యేక ప్రార్థనల్లో పాస్టర్ల ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమని, సత్యం, అహింస, మంచి మార్గంలో నడుస్తూ సాటివారికి సాయపడే తత్వాన్ని అందరూ అలవర్చుకోవాలన్నారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భారీగా అన్న సంతర్పణ చేశారు.

వేగవంతంగా కుల గణన సర్వే



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వేను అధికారులు వేగవంతం చేశారు. సోమవారం తెనాలి పట్టణంలో అన్ని వార్డులలో దీనిని నిర్వహించారు. వార్డు వలంటీర్లు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి వారి కులాల వివరాలు నమోదు చేసి ఇంటి సభ్యులలో ఒకరితో బయోమెట్రిక్ వేయించారు. ఈనెల 28వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



అన్నవరపులంక(కొల్లిపర): మండలంలోని అన్నవరపులంక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు పులగం మహేష్ బాబు, సుజాత కలసి రూ.20 వేలు విలువ చేసే లేజర్ ప్రింటర్‌ను సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థి పాటి శ్రీరాం ద్వారా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.మల్లేశ్వరరావు తెలిపారు.

తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ

స్కూటీతో పాటు బంగారు వస్తువుల అపహరణ

పెదకాకాని: గ్రామంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు జరుగుతున్నాయి. పెదకాకాని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పెండ్యాల శ్రీధర్ లారీ డ్యూటీకి వెళ్లాడు. గత శుక్రవారం ఆయన భార్య దుర్గ రాజమండ్రి పుట్టింటికి వెళ్ళింది. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గుర్తించిన దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా తీసి అందులో ఉన్న బంగారు వస్తువులు దొంగిలించారు. ఇంటి ఆవరణలో ఉన్న స్కూటీని కూడా ఎత్తుకుపోయారు. సోమవారం ఇంటికి వచ్చిన దుర్గ తలుపులు తీసి ఉండటాన్ని గుర్తించింది. ఇంటిలోనికి వచ్చి చూసే సరికి బీరువా తెరచి అందులో ఉన్న వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంటిలో దొంగలు పడి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రతి ఇంటి సమస్యకు పరిష్కారం

- ఆత్మకూరులో గుడ్ మార్నింగ్ మన మంగళగిరి కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్సీ హనుమంతరావు, సమన్వయకర్త చిరంజీవి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, సమన్వయకర్త చిరంజీవి

తాడేపల్లిరూరల్: ఆత్మకూరులో సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గుడ్‌మార్నింగ్ మన మంగళగిరి కార్యక్రమం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త గంజి చిరంజీవి, ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి నిర్వహించారు. వైఎస్సార్ కాలనీ (టేకు తోట), కొబ్బరితోట కాలనీ, వడ్రుపాలెంలో ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల వాసులు స్థానిక సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఇళ్ల పట్టాలు, ఇంటి పన్నులు లేవని వివరించడంతో.. ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల కుమార్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని సమన్వయకర్త గంజి చిరంజీవి సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్సీ హనుమంతరావు, గంజి చిరంజీవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సంక్షేమ పథకాల అమలును తెసుకుంటున్నట్లు చెప్పారు. ఆత్మకూరులో 600 కుటుంబాలను పలకరించామని, వారిలో 98 శాతం సంక్షేమ పథాకాలు అందుతున్నాయని చెప్పినట్లు పేర్కొన్నారు. జగనన్నకు తోడుగా ఉండి రానున్న ఎన్నికల్లో మళ్లీ పట్టంకట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్ము శివారెడ్డి, సాంబిరెడ్డి, జాలాది నాగేశ్వరరావు, సకేరియా, మన్నెం నాగేశ్వరరావు, రవి, వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, గుండా మధు, తోట శ్రీనివాసరావు, బెజ్జం రాజాజీ తదితరులు పాల్గొన్నారు.

కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లిరూరల్ : కురగల్లులో పలు అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి ప్రారంభించారు. కురగల్లులో రూ.20 లక్షల వ్యయంతో దళిత వాడ కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ హనుమంతరావు శంకుస్థాపన చేశారు. అభ్యుదయ సేవా సంస్థ (కాస్)ను గంజి చిరంజీవి ప్రారంభించారు. గంజి చిరంజీవి మాట్లాడుతూ కురగల్లులో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ స్థలానికి రూ.20 లక్షలు, స్కూల్ భవనానికి మరో రూ.20 లక్షలు కేటాయించామన్నారు. దళితవాడ శ్మశాన అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు మురుగుడు హనుమంతరావు తెలిపారు. దళితవాడ ప్రయోజనం కోసం రూ.80 కోట్ల విలువైన స్థలాన్ని కేటాయించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని వారు పేర్కొన్నారు. కురగల్లు అభ్యుదయ సేవా సంస్థకు తిరుపతి ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు సొపాటి క్రీడా కిట్లు అందజేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు కట్టిపోగు బసవరావు, వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి రూరల్ అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి, ఉదయ భాస్కర్, ఎలక్షన్ రావు, భూషణం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, గంజి చిరంజీవి

ఓటర్ల తుది జాబితా విడుదల

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ నగరపాలక సంస్థలో మంగళగిరి నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితా సోమవారం మంగళగిరి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం. లక్ష్మీకుమారి, తాడేపల్లి అర్బన్ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బిక్కిరెడ్డి శివారెడ్డి వేర్వేరుగా విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని పోలింగ్ బూత్ నెం.19 నుంచి 66 వరకు, (తాడేపల్లి అర్బన్), బూత్ నెం. 140 నుంచి 201 (మంగళగిరి అర్బన్) వరకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను విడుదల చేశామని తెలిపారు. ఓటు నమోదుకు, మార్పులు చేర్పులకు ఫారం 6, 7, 8 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో....

దుగ్గిరాల తహసీల్దారు కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం. లక్ష్మీ కుమారి ఓటర్ల తుది జాబితా సోమవారం విడుదల చేశారు. దుగ్గిరాలలో మొత్తం 51,376 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని వీరిలో పురుషులు 24,768, స్త్రీలు 26,602 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.



ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తున్న ఎం.లక్ష్మీకుమారి

పుల్లేశ్వరరావు పవర్ లిఫ్టింగ్ జోన్ ప్రాంగణం పరిశీలన

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ నిర్మించిన గుమ్మడి పుల్లేశ్వరరావు పవర్ లిఫ్టింగ్ జోన్ ప్రాంగణాన్ని సోమవారం సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ప్రధాన కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ అధ్యక్షుడు మద్ది ప్రభాకరరావు, పీవీ సంజీవ్‌తో కలసి సందర్శించారు. సకల కోటేశ్వరరావు మాట్లాడుతూ గుమ్మడి పుల్లేశ్వరరావు పవర్ లిఫ్టింగ్ జోన్ భవిష్యత్తులో పవర్ లిఫ్టింగ్ గేమ్స్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోశాధికారి బి. బద్రీ నాథ్, వైస్ ప్రెసిడెంట్ ఎస్కే సందాని, మెంబర్ కొమ్మాకుల విజయభాస్కర్, గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రాంగణం పరిశీలనలో ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు

బాల రాముని ప్రతిష్ఠ.. భక్తజన పండగ

- వాడవాడలా రామాలయాల్లో ప్రత్యేక పూజలు
- శోభా యాత్రలు, అన్నదానాలతో ఆధ్యాత్మిక వాతావరణం

తాడేపల్లిరూరల్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరగడంతో మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి, దుగ్గిరాల మండలం రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయకీలాద్రిపై పెద్ద జీయర్‌స్వామికి అభిషేక మహోత్సవం, అష్టోత్తర శత నామార్చన నిర్వహించారు. రామచంద్రస్వామి శేష వస్త్రం పెద్దజీయర్ స్వామికి సమర్పించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మట్లాడుతూ.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అనుగ్రహాన్ని పొందారని, వారికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశామని తెలిపారు. మధుసూదనాచారి, జీయర్ ఎడ్యుకేషన్ వేద విద్యార్థులు పాల్గొన్నారు. పెనుమాకలో ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పలుచోట్ల సీతారాముల చరిత్రను వివరించి, అన్నసంతర్పణ చేశారు. యాగశాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ వైష్ణవ మహా దివ్యక్షేత్ర సేవా సంఘం అధ్యక్షులు దూపుగుంట్ల శ్రీనివాసరావు, చలువాది మల్లికార్జున రావు, కోశాధికారి రెడ్డి ఉమామహేశ్వర గుప్తా, ఉపాధ్యక్షులు గట్టా ధనప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దుగ్గిరాలలోని రైలు పేటలో కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీరామరక్ష స్తోత్రములు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అయోధ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. రామనగర్‌లో శ్రీరామచంద్రుని శోభా యాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఉండవల్లిలోని రెడ్ల రామ మందిరం, కాపుల రామమందిరాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉండవల్లి రెడ్ల రామ మందిరం వద్ద సీతారాముల భక్తి గీతాలను చెక్కభజన ద్వారా ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ ఉండవల్లి కన్వీనర్ దంటు గోవర్ధనరెడ్డి పాల్గొన్నారు. మంగళగిరి సగర కమ్యూనిటీ హాల్‌లో సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు పందేటి సాంబశివరావు, నాయకులు పాల్గొన్నారు. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శివ భజన భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీరామ సంకీర్తన నిర్వహించారు. మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, శ్రీమతి అనిత, భక్తబృందం ప్రతినిధులు పాల్గొన్నారు. చిర్రావూరులో శ్రీరామ ప్రభువు శోభ యాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయంలో ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

ఫిరంగిపురం: మండల కేంద్రలో సీతారామస్వామి ఆలయంలో సోమవారం అర్చకులు రాజేంద్రశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శ్రీరాముడి చిత్రపటాన్ని గ్రామంలో శోభా యాత్ర నిర్వహించారు.



తాడేపల్లి పెనుమాకలో ప్రారంభించిన యాగశాల



భక్తులకు అన్నదానం



ఫిరంగిపురలో శోభా యాత్ర

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్ : రత్నాల చెరువుకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందడంతో.. మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మృతుని కుటుంబానికి నగదు అందజేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త కలవకొల్లు శివయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో రూ. 5వేల నగదు అందజేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ మంగళగిరి ఎస్ఎస్-2 విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని టౌన్-3 ఫీడర్ ట్రీ కటింగ్, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు డిగ్రీ కాలేజ్ వెనుక, ఊర్వశి థియేటర్, న్యూ ఇండియా హోటల్ ఏరియా, ఇస్లాంపేట, గౌతమ బుద్ధ రోడ్‌లో కొంత భాగం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ పేర్కొన్నారు.

రేపు వైఎస్సార్ ఆసరా అందజేత

కొల్లిపర: వైఎస్సార్ ఆసరా మండల స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం స్థానిక అవుతు రామిరెడ్డి కళాశాల ప్రాంగణంలో మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి, ఏపీఎం ప్రియదర్శిని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జెడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా హాజరవుతారన్నారు. మండలంలోని డ్వాక్రా సంఘ సభ్యులు, యానిమేటర్లు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

25న మండల సమావేశం

కొల్లిపర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 25న మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. హాజరు కాని వారిపై తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని పేర్కొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే చర్యలు

నెహ్రూనగర్: గుంటూరు ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో సోమవారం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీటీసీ షేక్ కరీమ్ మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికుల్ని ఎక్కించరాదని చెప్పారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు. అనంతరం రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ

తెనాలి: ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమగ్ర విద్య కోసం ప్రభుత్వం అందజేస్తున్న విద్యా అవసరాల్లో భాగంగా మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ సోమవారం సాయంత్రం ఇద్దరు విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. రూరల్ మండలం ఖాజీపేట జెడ్పీ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్న వినికిడిలోపం కలిగిన కె.నాగేంద్రవరుణ్, తెనాలి గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్లో చదువుతున్న దృష్టిలోపం కలిగిన కె.బాలమణికంఠకు వీటిని అందజేశారు. ఎంఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న బాలాజీరావుపేట భవిత సెంటర్లోని విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం సహాయ పరికరాలు, బోధనాభ్యసన సామగ్రి, ఎస్కార్ట్ అలవెన్సులు అందజేస్తున్నట్టు గుర్తుచేశారు. ఇందులో భాగంగానే అత్యంత నాణ్యత కలిగిన ట్యాబ్‌లను అందజేశామన్నారు. వీరికి డిజిటల్ విధానం ద్వారా అభ్యసన సామర్థ్యాలను పెంచుకునేలా బోధన జరుగుతుందన్నారు. సమ్మిళిత విద్యలో భాగంగా వైకల్యం కలిగిన వారు సైతం స్క్రీన్ చూడటం, వినడం ద్వారా పాఠాలను చక్కగా నేర్చుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో-2 జయంత్‌బాబు సూచించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయినులు వై.రాజకుమారి, డి.సునీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు అందజేసిన ఎంఈఓ లక్ష్మీనారాయణ

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

చేబ్రోలు: పేద విద్యార్థులను గ్లోబల్ సిటిజన్‌గా తీర్చిదిద్దే విధానంలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లను అందజేస్తున్నట్లు చేబ్రోలు ఎంఈవో-1 హెచ్‌వీ ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి హెచ్ఎం ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఎంఈవో-2 ఆర్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.30వేల విలువైన ట్యాబ్‌లను విద్యార్థులకు అందించటం అదృష్టమన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, కొక్కిలగడ్డ కిరణ్, దాసరి రత్నరాజు జి శ్రీరెడ్డి, ఇంటూరి సాంబిరెడ్డి తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారన్నారు. నాడు - నేడు ద్వారా పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి పాఠశాలల రూపు రేఖలను మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి

లక్ష్మీపురం: వాడుక భాష వ్యాప్తి కోసం గిడుగు రామ్మూర్తి తన జీవితాన్ని ధారపోశారని, ఉత్తమ విమర్శకుడిగా, శాసన పరిశోధకుడిగా పలు సేవలందించిన ధన్యజీవి అని ప్రముఖ రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గిడుగు రామ్మూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పరభాషా వ్యామోహంతో అమ్మ భాషను నిర్లక్ష్యం చేయడం నేరమని గిడుగు రామ్మూర్తి చాటి చెప్పారన్నారు. భాషను రక్షించుకోవడం సామాజిక అవసరమని, దేశ క్షేమానికి భాషా క్షేమం పునాది అని చాటి చెప్పిన గిడుగు వ్యావహారిక భాష కోసం తన జీవితాన్ని అంకితం చేశారని వివరించారు. సాహితీ వేత్త పి.వి.రామ్‌కుమార్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అధిక జనాభాకు విజ్ఞానం, సృజనశక్తి, సంస్కారం అందజేయ్యాలని ఉద్యమించిన గిడుగు భాష కోసం అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు.

చిరస్మరణీయుడు అక్కినేని నాగేశ్వరరావు

వర్ధంతి సభలో వక్తలు

తెనాలి: పట్టణానికి చెందిన స్వరలయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు 10వ వర్ధంతి సదస్సును నిర్వహించారు. స్థానిక మారీసుపేటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటైన సదస్సులో అక్కినేని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అక్కినేని జీవిత విశేషాలను సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు వెల్లడించారు. బాలనటుడిగా, స్త్రీ పాత్రల్లో నటిస్తూ సినీరంగ ప్రవేశం చేసిన అక్కినేని తన అభినయ కౌశలంతో నటసామ్రాట్‌గా పిలిపించుకున్నారని చెప్పారు. 256 సినిమాల్లో నటించారని, 'మనం' సినిమా చివరిదని అన్నారు. తెలుగు సినిమా ఉన్నంతకాలం ఆయన చిరస్మరణీయులని చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులను అందుకున్న గొప్ప నటుడని తెలిపారు. శ్రీధర్, నటులు మల్లేశ్వరరావు, హేమాచారి, పినపాటి సురేష్‌బాబు, రొంపిచర్ల సురేష్, జవ్వాది ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



అక్కినేని చిత్రపటానికి నివాళి

30 నుంచి సువార్త స్వస్థత మహాసభలు

తెనాలి: క్రైస్ట్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో తెనాలిలో సువార్త స్వస్థత మహాసభలను నిర్వహించనున్నారు. మారీసుపేట రెండు గేట్ల మధ్య గల సెయింట్‌పాల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సోమవారం సాయంత్రం మహాసభల వాల్‌పోస్టర్‌ను రెవరెండ్ మేకల సునీల్, బ్రదర్ కూచిపూడి ప్రేమ్‌సాగర్ ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు సభలు ప్రారంభిస్తారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో, విజయవాడ ప్రాంతంలో దైవసేవలో గుర్తింపును పొందిన క్రైస్ట్ టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్, సిస్టర్ నిస్సిపాల్ సువార్త సభలో వాక్య పరిచర్య చేస్తారని తెలిపారు. ప్రముఖ సంగీత గాయకులతో ప్రత్యేక స్తుతి ఆరాధన ఉంటుందన్నారు. తెనాలి, పరిసరాల్లోని క్రైస్తవులంతా పాల్గొని దైవ ఆశీర్వాదం పొందాలని కోరారు. సొపాటి కిరణ్, చావలి అకుల్ నాథ్, చావలి తేజోనాథ్, బొంత ప్రేమ్, పినపాటి కొండలరాజు, కొవెరపు వినోద్, తోట శ్రీనివాసరావు, వేమూరు రవి, ఆలపాటి సుధీర్, పినపాటి సునీల్‌పాల్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెదకాకాని: జాతీయ రహదారిపై వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీ కొన్న సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న షేక్ రజియా మృతి చెందగా ఆమె భర్త, పిల్లలకు గాయాలయ్యాయి. పెదకాకాని పోలీసుల కథనం ప్రకారం గుంటూరుకు చెందిన షేక్ బాబర్‌కు భార్య రజియా, కుమారుడు అక్బర్, కుమార్తె సాంగినా సంతానం. షేక్ బాబర్ ఆదివారం విజయవాడలో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి భార్య, పిల్లలతో స్కూటీపై బయలు దేరాడు. వారు ప్రయాణిస్తున్న స్కూటీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న పాస్టరల్ ట్రెనింగ్ సెంటర్ సమీపంలోకి చేరుకునే సరికి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీ కొంది. ఈ ఘటనలో స్కూటీపై ప్రయాణిస్తున్న షేక్ రజియా(37)పై లారీ చక్రాలు ఎక్కి అక్కడికక్కడే మృతి చెందగా భర్త బాబర్, కుమారుడు అక్బర్, కుమార్తె సాంగినాలకు గాయాలయ్యాయి. బంధువులకు సమాచారం అందించి ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆదివారం రాత్రి పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు షేక్ బాబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం రజియ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.